క్లుప్తంగా

శ్రీకృష్ణభగవానుడికి ప్రత్యేక పూజలు



నెల్లూరు(బృందావనం): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ నగర్‌లో 6వ రోజు సోమవారం శ్రీకృష్ణభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైభవంగా కొనసాగుతున్న వేడుకలు, పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొని శ్రీకృష్ణపరమాత్ముడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి – ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ నిర్వాహకులు సురమౌళి, రాజగోపాల్, కేవీ రత్నం, జి.వెంకటేశ్వరరావు, పద్మజ, నర్మద, మనోజ, పెంచల ప్రసాద్, సురేష్ తదితరులు పర్యవేక్షించారు.

సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వేమారెడ్డి

నెల్లూరు(క్రైమ్): సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా కె.వేమారెడ్డి సోమవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ డి.హిమవతి, ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనచోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే కేసులు తప్పవని పేర్కొన్నారు.

ఆక్రమణల తొలగింపు



పొర్లుకట్ట వద్ద అక్రమ కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురం నుంచి జనార్దనరెడ్డి కాలనీకి వెళ్లే మార్గంలో పెన్నా పొర్లుకట్ట ఆనుకుని నిర్మించుకుని ఉన్న అక్రమ కట్టడాలను అధికారులు ఆదివారం నుంచి తొలగిస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి ప్రత్యామ్నాయంగా జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల మంజూరుకు అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేయడంతో ఇళ్ల యజమానులు అధికారులకు సహకరించారు. అయితే ఈ ప్రాంతంలోని పలువురు తమ కట్టడాలను తొలగించకుండా ముందస్తుగా కోర్టు నుంచి స్టే తీసుకురావడంతో వారి ఇళ్లను మినహాయించి మిగిలిన వాటిని తొలగిస్తున్నారు. అయితే ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే ప్రత్యామ్నాయం చూపించి, ఇళ్ల నిర్మాణాలకు ఆర్థికసాయం చేయాలంటూ సోమవారం సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, శాఖా కార్యదర్శి మూలం ప్రసాద్ కోరారు. ఆక్రమణల తొలగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాబి తన సిబ్బందితో పర్యవేక్షించారు.

ఇంకుడుగుంతలతో బహుళ ప్రయోజనాలు



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : ఇంకుడు గుంతలతో బహుళ ప్రయోజనాలున్నాయని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. కొడవలూరు దర్గా సంఘంలో నూతనంగా నిర్మించుకున్న ఇంకుడు గుంతలను హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్‌తో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంట్లోని మురుగునీటిని రోడ్లపై వదలకుండా ఇంకుడు గుంతలు ఉపయోగపడుతాయన్నారు. అంతేకాకుండా భూగర్భ జలాలను సంరక్షించుకునేందుకు ఉపకరిస్తుందని చెప్పారు. వీటి నిర్మాణానికి ఉపాధి హామీ ద్వారా రూ.6 వేలు ఇస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ వెంట హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ జానీ, ఎఫ్ఏ కె.రమేష్ ఉన్నారు.

స్థూల నమోదు నిష్పత్తిని మెరుగుపరచాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

• కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేందుకు ఉద్దేశించిన స్థూల నమోదు నిష్పత్తిని మరింతగా మెరుగుపరిచేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మనబడి నాడు–నేడు పనులు, హౌసింగ్ గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుర్తించిన బడి బయట పిల్లలను బడిలో చేర్చేందుకు ఉద్దేశించిన స్థూల నమోదు నిష్పత్తి సర్వే వంద శాతం సాధించేందుకు కృషి చేయాలన్నారు. వివాహాలు జరిగి బయటకు వెళ్లిన వారిని మినహాయించి మిగిలిన అన్ని కేటగిరీల వారిని బడిలో చేర్చేందుకు సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ఇందుకు గాను ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక చర్యలు చేపట్టి సర్వే పూర్తి చేయాలన్నారు. అలాగే జగనన్న గోరుముద్ద పథకం పట్టణ ప్రాంతాల్లో వంద శాతం అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా రెండో విడత మనబడి నాడు–నేడు కింద జరుగుతున్న పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్లు, అదనపు గదుల నిర్మాణాలను, వంటగదుల స్లాబ్ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. హౌసింగ్ పురోగతిని సమీక్షిస్తూ ఇళ్లు నిర్మించుకునే స్వయం సహాయక గ్రూపులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని, ఇళ్లు మంజూరై గ్రూపుల్లో సభ్యులుగా లేని వారి విషయంలో వెంటనే వారిని పాత గ్రూపుల్లో చేర్చడం లేదా నూతన గ్రూపులుగా తయారు చేయాలని, గృహ నిర్మాణానికి డ్వామా ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయానికి సంబంధించి అన్ని పనులను పూర్తి చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాదరాజుగూడూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ మండలంలోని మాదరాజుగూడూరు గ్రామంలో సోమవారం సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే దాదాపుగా ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, మరిన్ని నిధులు త్వరలో విడుదలవుతాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం లబ్ధి చేకూర్చడంతో ప్రజాదరణ లభించిందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైనప్పటి నుంచి రూరల్‌లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. మాదరాజుగూడూరు గ్రామంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు జరగడంతోపాటు అర్హులకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ విజయకుమార్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అన్ని విభాగాలు త్వరలో ఒకే భవనంలోకి



డయాగ్నోస్టిక్ భవనాన్ని పరిశీలిస్తున్న వివిధ విభాగాల అధిపతులు

నెల్లూ(సెంట్రల్): నెల్లూరులోని సర్వజన వైద్యశాలలో డయాగ్నోస్టిక్ సెంటర్ భవనంలోకి అన్ని విభాగాలు మార్చనున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ నరేంద్ర తెలిపారు. వైద్యశాల ఆవరణలో ఉన్న డయాగ్నోస్టిక్ భవనాన్ని వివిధ విభాగాల అధిపతులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త నిల్వ కేంద్రం, పేథాలజీ తదితర సేవలు వేరే భవనంలో ఉన్నాయని, కేవలం రేడియాలజీ మాత్రమే ఇక్కడ ఉందని, డయాగ్నోస్టిక్ సెంటర్‌కు సంబంధించి అన్ని విభాగాలు ఒకేచోటుకు మార్చితే వైద్యశాలకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం భవనంలో జరుగుతున్న చిన్న చిన్న పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ జమున, బయో కెమిస్ట్రీ విభాగాధిపతి మాధవి, పేథాలజీ విభాగాధిపతి సాయిప్రసాద్, మైక్రో బయోలజీ విభాగాధిపతి వెంకటేశ్వర్లు, ఏపీఎంఎస్ఐడీసీ విభాగాధిపతి గోపిరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

రోటరీక్లబ్ అవెన్యూస్ నెల్లూరు శాఖ ప్రారంభం



ప్రెసిడెంట్, సెక్రటరీలుగా బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణచైతన్య, కళాకృష్ణస్వామి

నెల్లూరు(బృందావనం): నెల్లూరు నగర పరిధిలో రోటరీ క్లబ్ అవెన్యూస్ నెల్లూరు శాఖ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ స్పెషల్ రిప్రజెంటేటివ్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ కొండాశేఖర్‌రెడ్డి మాట్లాడారు. నెల్లూరు పోలీసు పరేడ్ గ్రౌండ్ సమీపంలోని బ్రహ్మానందపురం ప్రశాంతినగర్‌లో 'అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్'లో 'రోటరీక్లబ్ అవెన్యూస్ నెల్లూరు శాఖను ఘనంగా ప్రారంభించామన్నారు. అంతర్జాతీయ నిబంధనల మేరకు క్లబ్ ప్రారంభం సందర్భంగా చార్టర్ ప్రజెంటేషన్ జరిగిందన్నారు. ఈ సందర్భంగా అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ కరస్పాండెంట్ పెనుబల్లి కృష్ణచైతన్య చార్టర్ ప్రెసిడెంట్‌గా, అకడమిక్ డీన్ కళాకృష్ణస్వామిని చార్టర్ సెక్రటరీగా, మరో 20 మంది ఉపాధ్యాయులను సభ్యులుగా నియామకం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ నెల్లూరు ప్రెసిడెంట్, సెక్రటరీలు సమీవుల్లా, ఉదయభాస్కర్, అసిస్టెంట్ గవర్నర్ జోన్–1(సింహపురి) ఎ.భానుమతి, రోటరీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానిక్ పవర్, డిస్ట్రిక్ట్ ఫస్ట్‌లేడీ శిల్ప, ఐపీడీ వొమ్మిన నాగసతీష్‌బాబు, రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులంతా ఐక్యంగా మెలగాలి

• అమరావతి కృష్ణారెడ్డి



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని డ్యాన్స్ కళాకారులందరూ ఐకమత్యంగా సాగి భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి సూచించారు. జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎంపికైన కార్యవర్గాన్ని సోమవారం రాత్రి 25 కళాసంఘాల చాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా డ్యాన్స్‌మాస్టర్స్ అసోసియేషన్‌కు 25 కళాసంఘాల ద్వారా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. జిల్లా డ్యాన్స్‌మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ జకీర్, కంచి జనార్దన్, ఉపాధ్యక్షుడిగా సర్వేపల్లి సాయి ఎంపికైనట్లు అసోసియేషన్ పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు బండి చిట్టిబాబు, వేణుంగిరిరాజు, కోదండపాణి తెలిపారు. కార్యక్రమంలో 25 కళాసంఘాల కన్వీనర్లు దొర్నాల హరిబాబు, అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, డ్యాన్స్‌మాస్టర్లు రమేష్, ఝాన్సీ, శాంతిరెడ్డి బబ్లూ, జయకుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

16లోగా జాబితాను సరిచేయండి

• స్పెషల్ కలెక్టర్ ఓబులేషు

మనుబోలు : ఈనెల 16వ తేదీలోగా ఓటర్ల జాబితాలో మార్పు చేర్పులను పూర్తి చేసి తప్పులను సరిచేయాలని స్పెషల్ కలెక్టర్ ఓబులేసు బీఎల్వోలకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో ఆయన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో నియోజకవర్గంలో మనుబోలు మండలం వెనుకబడి ఉందని, ఇకనైనా బీఎల్వోలు చురుగ్గా పనిచేయాలని సూచించారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలు, సూచనల ప్రకారం జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, డీటీ శ్రీకాంత్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

22న నాలుగో విడత ఐటీఐ కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు ఈ నెల 22న స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ గరల్స్ ఐటీఐలో నాలుగో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రజియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 19వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. 20న తమ ధ్రువీకరణ పత్రాలను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు.

న్యాయవాది మృతికి సంతాపం

నెల్లూరు(లీగల్): సీనియర్ న్యాయవాది ఎం.శ్రీనివాసులు మృతికి పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు. జిల్లా కోర్టు హాలులో సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని అధ్యక్షతన ఈ సంతాప సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మృతిచెందిన న్యాయవాది శ్రీనివాసులు జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులతోపాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య, కమిటీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


మందుల విక్రయాల్లో జాగ్రత్తలు అవసరం

నెల్లూరు(సెంట్రల్): మందులు, నార్కోటిక్ డ్రగ్స్ విక్రయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా డ్రగ్స్ అధికారి వీరకుమార్‌రెడ్డి అన్నారు. మందుల విక్రయాలపై 'ద నెల్లూరు డిస్ట్రిక్ట్ హోల్‌సేల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్' ఆధ్వర్యంలో నెల్లూరులోని హోల్‌సేల్ మెడికల్ భవన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తి పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని ధనలక్ష్మీపురం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు, స్థానికుల కథనం మేరకు ధనలక్ష్మీపురంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అనిల్ కదిర్‌రెడ్డి తన సైకిల్‌పై వెళుతుండగా నెల్లూరు వైపు నుంచి ముత్తుకూరు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో సైకిల్‌పై వెళుతున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం సమీపంలోని నారాయణ ఆస్పత్రికి తరలించారు. సోమవారం రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో వారు ఆస్పత్రికి చేరుకుని విచారించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబుకు శిక్ష పడాల్సిందే



మాట్లాడుతున్న పాలకీర్తి రవి

నెల్లూరు రూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్ట్ అయిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడికి తగిన శిక్ష పడాల్సిందేనని వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి అన్నారు. నగరంలోని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు చేసిన అక్రమాలు ప్రస్తుతం బహిర్గతం కావడంతో అరెస్ట్ అయ్యారని, ఇది ఆయన పతనానికి నాంది అని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 25వ డివిజన్ బుజబుజనెల్లూరు నాగమ్మకాలనీలో టీడీపీకి చెందిన 100 మంది సోమవారం నగరంలోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ ఆదాల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గంధళ్ల వెంకటశేషయ్య ఆధ్వర్యంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు షానవాజ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖాదర్‌బాషా సమన్వయంతో వారు పార్టీలో చేరారు. వచ్చే ఎన్నికల్లో తమవంతు పూర్తి సహకారం వైఎస్సార్‌సీపీకి ఉంటుందని పార్టీలో చేరిన వారు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. 25వ డివిజన్‌లోని పలు ప్రాంతాల వారు వరుసగా వైఎస్సార్‌సీపీలో చేరడం శుభపరిణామమని ఎంపీ వారిని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు

• కమిషనర్ వికాస్ మర్మత్



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: స్పందనలో వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆయా విభాగాల అధికారులకు సూచించారు. నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదులను స్వీకరించిన కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి కుళాయిల పన్ను బకాయిలు లేకుండా వసూలు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి అభ్యర్థనలను విచారించి అర్హులైన వారికి గృహాలు కేటాయించాలని తెలిపారు. జగనన్నకు చెబుదాం, 1902, స్పందనలో వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలన్నారు. అధికారులకు కేటాయించిన సచివాలయాలను తప్పనిసరిగా తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, హెల్త్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఘాట్‌ల పరిశీలన



నెల్లూరు చెరువు గణేష్ నిమజ్జన ఘాట్‌ను పరిశీలిస్తున్న బృందం

నెల్లూరు(బృందావనం): వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా గణేష్ విగ్రహాల నిమజ్జనం జరిగే నెల్లూరు చెరువు గణేష్‌ఘాట్, రంగనాయకులపేట పెన్నాబ్యారేజీ ప్రాంతాలను విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆ సమితి ప్రతినిధులు మాట్లాడారు. ఈ నెల 18, 19 తేదీల నుంచి నగరంలో వినాయకచవితి ఉత్సవాలు ప్రారంభమై 23వ తేదీన గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవం జరగనుందన్నారు. ఇప్పటికే నగరంలో వివిధ ప్రాంతాల్లో వినాయకచవితి ఉత్సవాల ప్రారంభ సూచికగా పలు కూడళ్లలో మండపాల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. నగరంలోని శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం పక్కన నెల్లూరు చెరువువద్ద, రంగనాయకులపేటలోని పెన్నాబ్యారేజీ వద్ద ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో చేపడుతున్న విస్తృత ఏర్పాట్లు, అభివృద్ధి పనులను పరిశీలించామన్నారు. మరో వారం రోజుల్లో పనులన్నీ పూర్తి కాగలవన్న ఆశాభావాన్ని బృందం వ్యక్తం చేసింది. వినాయకచవితి ఉత్సవాలను సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు నగరంలోని టీవీఎస్ కల్యాణసదన్‌లో విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి కార్యాలయం మంగళవారం ప్రారంభించనున్నట్లు బృందం తెలిపింది. ఈ కార్యాలయం నగరంలోని అన్ని డివిజన్‌లలో ఉన్న వినాయకచవితి తాత్కాలిక మండపాల నిర్వాహకులకు, జిల్లా ప్రభుత్వ యంత్రాంగానికి వారధిగా పనిచేస్తుందని బృందం వివరించింది. కార్యక్రమంలో పిట్టి సత్యనాగేశ్వరరావు, పి.సురేంద్రరెడ్డి, ఏవీఆర్ మోహన్‌రావు, టి.భాస్కరరెడ్డి,, కేవీ సుబ్రహ్మణ్యం, పి.భాస్కర్ యశ్వంత్‌సింగ్, నరసింహనాయుడు, మల్లికార్జున్, మోహన్‌రెడ్డి, ఫణిరాజు, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాబు రూ.241 కోట్ల అవినీతి సిగ్గుచేటు

• వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.241 కోట్ల అవినీతికి పాల్పడడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబును అరెస్ట్ చేయడంతో ఎన్టీఆర్ అభిమానుల ఆనందానికి అవధులు లేవన్నారు. వైస్రాయ్ హోటల్‌లో చంద్రబాబు చేసిన దుశ్చర్య ఆయన పాలిట శాపమైందని అన్నారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబు సమస్యను తన ఇంటి సమస్యగా భావించి రోడ్డుపై పడుకుని నిరసన తెలపడం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబుపై ఉన్న కేసులకు సంబంధించి ఉన్న స్టేలు రద్దు చేసి విచారించాలన్నారు. టీడీపీ నేతలు లోకేశ్, అచ్చెంనాయుడులను కూడా అరెస్ట్ చేయాలన్నారు.

బంద్‌కు పిలుపునిచ్చినా..!



నెల్లూరు నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద వాహనాల రద్దీ

టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్ట్ అయి రిమాండ్‌కు వెళ్లిన నేపథ్యంలో ఆ పార్టీ నేతలు సోమవారం బంద్‌కు పిలుపునిచ్చినా నెల్లూరు నగరంలో ఎక్కడా బంద్ ఆనవాలు కనిపించలేదు. వాహనదారులు, వ్యాపారులు, ఇతర అన్నివర్గాల వారు తమ పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో బంద్ ప్రభావం ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు.



ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు, ప్రయాణికుల రాకపోకలు



ఆర్టీసీ వద్ద బందోబస్తు విధుల్లో పోలీసులు



కూరగాయల మార్కెట్ వద్ద తెరుచుకున్న దుకాణాలు